సాక్షి
కుమురం భీం
బుధవారం ∣ 29 ∣ మే ∣ 2024



అరచేతిలో 'వాతావరణం'
వాతావరణ మార్పులు తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ యాప్‌లతో వాతావరణ సమాచారం మన అరచేతిలో ఉన్నట్లే.. 8లో▸



మండుతున్న ఎండలు!
జిల్లా అగ్నిగుండంగా మండుతోంది. వారం రోజులుగా ఎండలు, వేడిగాలులతో వడదెబ్బ తగిలి మృతి చెందుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.8 /31.6

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉదయం నుంచే వేడి అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియెట్ ప్రవేశాల గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రవేశాల గడువు ఈ నెల 25తో ముగియగా.. విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 31 వరకు పొడిగించారని పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి రుసుం చెల్లించకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్ పోటీల్లో తిర్యాణి మండలం నాయకపుగూడ గ్రామానికి చెందిన గుండం అకిర నందన ప్రతిభ చూపింది. అండర్ 10 విభాగంలో 80 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. వచ్చే నెల 6, 7 తేదీల్లో హనుమకొండ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అకిర నందన పాల్గొంటుందని జిల్లా క్రీడా అధికారి మీనారెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి గుండం లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం రవిప్రసాద్ అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పదో ఆవిర్భావ వేడుకలకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూన్ 2 నిర్వహించే వేడుకలకు సంబంధించిన ఎజెండా, కార్యక్రమాల నిర్వహణ సమర్థవంతంగా ఉండాలన్నారు. సీఈఆర్ క్లబ్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఎస్‌ఈ సివిల్ బాషా, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారు'

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన బదావత్ ప్రకాశ్ మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి ఫిర్యాదు చేశాడు. ఎమ్మార్పీకే విత్తనాలు, ఎరువులు విక్రయించేలా చూడాలని కోరాడు. అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నాడు.

తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి

ఆసిఫాబాద్‌అర్బన్: తేనెటీగల పెంపకంతో రైతులు, నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందవచ్చని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన యువతీ యువకులు, రైతుల కోసం తేనెటీగల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఐటీడీఏ కార్యాలయం లేదా 98486 87871, 88976 22042, 90323 13933 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో తేనెటీగల పెంపకంలోని మెలకువలు, మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి పొందడంతోపాటు పంట దిగుబడులు గణనీయంగా వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

బెబ్బులికి ఆ ఊరే అడ్డు!



గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు(ఫైల్)

- తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు అడవిలో ఇటిక్యాల పహాడ్..
- తాడోబా నుంచి జిల్లాలోకి పులుల ప్రవేశానికి ఇదే కీలక మార్గం
- గ్రామాన్ని తరలించేందుకు అటవీశాఖ కసరత్తు
- ఇప్పటికే 200 హెక్టార్ల భూమిలో ప్లాంటేషన్ ఏర్పాటు
- గిరిజనేతరులు కావడంతో పునరావాసం కల్పనపై తర్జనభర్జన

సిర్పూర్(టి): మహారాష్ట్రలోని తాడోబా పులుల అభయారణ్యం నుంచి జిల్లాలోకి పులుల రాకకు సిర్పూర్(టి) రేంజ్ పరిధిలో ఉన్న అటవీ గ్రామం ఇటిక్యాల పహాడ్ అడ్డుగా మారింది. ఈ నేపథ్యంలో పులుల సంచారానికి అవాంతరాలు తొలగించేందుకు జిల్లా అటవీశాఖ చర్యలు చేపట్టింది. మనుషుల అలికిడిని తగ్గించి అడవుల పెంపకంతోపాటు వన్యప్రాణుల రక్షణకు చర్యలు చేపడుతోంది. పులుల సంరక్షణ చర్యల్లో భాగంగా ఇటిక్యాల పహాడ్ గ్రామాన్ని సైతం అడవి నుంచి తరలించేందుకు కసరత్తు చేస్తోంది. గ్రామాన్ని పూర్తిగా అటవీ ప్రాంతం నుంచి తరలిస్తే కాగజ్‌నగర్ డివిజన్ తోపాటు కవ్వాల్ అభయారణ్యానికి పెద్దపులుల సంచారం పెరుగుతుందని ఫారెస్ట్ అధికారులు భావిస్తున్నారు.

పూర్తిగా అటవీ ప్రాంతంలో గ్రామం

సిర్పూర్(టి) మండలంలోని ఇటిక్యాల పహాడ్ గ్రామం పూర్తిగా అటవీ ప్రాంతంలోనే ఉంది. సుమారు 40 ఏళ్ల క్రితం వంద కుటుంబాలతో గ్రామం ఏర్పడింది. ప్రస్తుతం 200 కుటుంబాలు ఉన్నాయి. 550 జనాభా ఉండగా 413 మంది ఓటర్లు ఉన్నారు. స్థానికులు పూర్తిగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరందరూ గిరిజనేతరులు. అటవీశాఖ పరిధిలోని భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. రెవెన్యూ గ్రామంగా ఇటిక్యాల పహాడ్‌కు సంబంధించిన సమాచారం రికార్డుల్లో లేదు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రభుత్వం 2018లో ఇటిక్యాల పహాడ్ గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేశారు. అయినా అటవీ భూములు కావడంతో ఇక్కడ ఇప్పటివరకు పల్లె ప్రగతి పనుల్లో భాగంగా చేపట్టిన డంపింగ్ యార్డు, శ్మశనవాటికలు ఏర్పాటు చేయలేదు.

ఆవాస యోగ్యంగా మార్చడమే లక్ష్యం..

నాలుగేళ్లుగా ఇటిక్యాల పహాడ్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారులు వన్యప్రాణుల రక్షణ చర్యల్లో భాగంగా నీటి కుంటలు, సోలార్ పీటీలు వంటివి ఏర్పాటు చేశారు. ప్లాంటేషన్లు ఏర్పాటు చేసి విస్తృతంగా మొక్కలు పెంచుతున్నారు. నిత్యం పెద్ద పులుల రాకపోకలపై నిఘా ఉంచేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. టైగర్ కారిడార్‌కు అనుకూలంగా ఉండటంతో గ్రామస్తులతో అధికారులు గతంలో పలుమార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పులుల సంరక్షణకు సహకరించాలని అవగాహన కల్పించారు. 2020 నుంచి అటవీ భూమిని సాగు చేయొద్దని గ్రామస్తులకు సూచిస్తున్నారు. 160 హెక్టార్ల సాగు భూముల తోపాటు ఎడారిగా మారిన ఇసుక ప్రాంతాలు సుమారు 200 హెక్టార్లను స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 600 హెక్టార్లను స్వాధీనం చేసుకుని టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేయడమే లక్ష్యమని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.



ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతంలోని నీటికుంట వద్ద జింకలు

గ్రామస్తులు సహకరించాలి

సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని ఇటిక్యాల పహాడ్ గ్రామం పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉంది. తెలంగాణ- మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతం టైగర్ కారిడార్‌గా మారింది. మహారాష్ట్ర నుంచి మన రాష్ట్రంలోకి పెద్దపులుల రాకపోకలు ఇదే ప్రాంతం గుండా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతాలను పులులకు ఆవాస యోగ్యంగా మార్చేందుకు చర్యలు చేపట్టాం. ఈ సంవత్సరం 200 హెక్టార్ల భూమిని సేకరించి ప్లాంటేషన్ ఏర్పాటు చేయనున్నాం. గ్రామస్తులు ఫారెస్టు అధికారులకు సహకరించాలి.

– పూర్ణచందర్, ఎఫ్ఆర్‌వో, సిర్పూర్(టి)

పునరావాసంపై ఊగిసలాట!

దట్టమైన అడవుల్లో ఉన్న ఇటిక్యాల పహాడ్ గ్రామాన్ని తరలించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే గ్రామం పూర్తిగా అటవీప్రాంతంలో ఉండటం, ప్రజలు గిరిజనేతరులు కావడంతో పునరావాసం కోసం ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుపై అనుమానాలు తలెత్తుతున్నాయి. గ్రామంలోని 200 కుటుంబాల్లో చాలా వరకు వలస వచ్చిన వారు ఉన్నారని తెలుస్తోంది. ముందు నుంచి ఇక్కడ నివాసం ఉంటున్న వారికి పరిహారం, పునరావాసం కల్పించేందుకు ఆస్కారం ఉండే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీల మేరకు ప్రతీ కుటుంబానికి ఐదెకరాల వ్యవసాయ భూమి, ఉండేందుకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికే పలుమార్లు గ్రామస్తులతో చర్చలు జరిపినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న తమకు ప్రభుత్వం ప్రత్యేకంగా భూములు కేటాయించి పక్కాగా పట్టాలు ఇచ్చి, మౌలిక సదుపాయాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

'కంపోస్టు'.. కంపల్సరీ



సెగ్రిగేషన్ షెడ్డు వద్ద కంపోస్టు ఎరువుల తయారీ కోసం తెచ్చిన పశువుల పేడ, మట్టి

- సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు
- ఎరువుల తయారీ ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం
- ప్లాస్టిక్ వ్యర్థాల లభ్యతకు అనుగుణంగా పీడబ్ల్యూఎం యూనిట్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే కంపోస్టు ఎరువుల తయారీపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇక నుంచి సెగ్రిగేషన్ షెడ్లలో ఎరువులు తయారీ తప్పనిసరిగా కానుంది. గత ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతీ జీపీలో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. ఇప్పటివరకు చాలాచోట్ల కంపోస్టు ఎరువుల తయారీ తూతూమంత్రంగా సాగుతోంది. అదనపు ఆదాయం రాకపోగా కంపోస్టు ఎరువుల తయారీ కోసం ఉపయోగించే వానపాములు, పశువుల పేడ కొనుగోలు తదితర ఖర్చుల భారం పంచాయతీలపై పడుతోంది.

సేంద్రియ ఎరువులకు డిమాండ్..

సేంద్రియ సాగు పెరగడంతో సేంద్రియ ఎరువులకు కూడా బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. ఈ తరుణంలో పంచాయతీలు కంపోస్టు ఎరువుల తయారీపై దృష్టి సారిస్తే అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నాణ్యతను బట్టి కిలోకు రూ.20 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. వర్మీ కంపోస్టు ఎరువుకు కావాల్సిన ప్రధానమైన ముడి సరుకు తడిచెత్త. పంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ ఇళ్ల నుంచి తడిపొడి చెత్త సేకరిస్తున్నారు. పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి, తడి చెత్తను మాత్రం సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువు తయారీ కోసం వినియోగించాలి. కానీ చాలాచోట్ల సిబ్బంది తడిపొడి చెత్తను వేరు చేయకుండా నిప్పు పెడుతున్నారు. తడి చెత్తను కంపోస్టు ఎరువుల తయారీకి ఉపయోగించకపోవడంతో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని జీపీల్లో సెగ్రిగేషన్ షెడ్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు. నర్సరీల్లోని మొక్కల పెరుగుదల, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. మిగిలిన ఎరువును రైతులకు విక్రయిస్తున్నారు.

334 సెగ్రిగేషన్ షెడ్లు..

జిల్లాలోని 334 గ్రామ పంచాయతీల్లో 334 సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ కోసం ప్రత్యేకంగా పిట్ సైతం ఏర్పాటు చేశారు. పిట్‌లో వానపాములు, ఎరువులు, మట్టి తడిచెత్త వేసి కొన్నిరోజుల పాటు నీళ్లు పట్టి వదిలేస్తున్నారు. నాణ్యమైన కంపోస్టు తయారీకి 45 రోజులపాటు తప్పనిసరిగా నీళ్లు పోయాలి. కౌటాల, జైనూర్, కాగజ్‌నగర్, రెబ్బెన, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల్లోని కొన్ని పంచాయతీల్లో మాత్రం కంపోస్టు ఎరువుల తయారీని సమర్థవంతంగా చేపడుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో దాదాపు 15 టన్నుల వరకు వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి విక్రయించినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పంచాయతీల్లో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువులో నుంచి 29,683 కిలోల వరకు హరితహారం కోసం వినియోగించారు. నర్సరీలు, పల్లె ప్రకృతి వనాల కోసం వినియోగించుకోగా.. మిగిలిన 847 కిలోల ఎరువును రైతులకు విక్రయించారు. దీని ద్వారా రూ.27,788 ఆదాయం సమకూరింది. అలాగే 2,838 కిలోల డ్రైవేస్ట్ విక్రయం ద్వారా రూ.41,522 అదనపు ఆదాయం పంచాయతీలు పొందాయి. అన్ని పంచాయతీల్లోనూ ఈ ప్రక్రియ సజావుగా కొనసాగితే అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది. ఇటీవల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కమిషనర్ షఫీయుల్లా సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం సెగ్రిగేషన్ షెడ్‌లో వేరు చేసి వ్యర్థాలను రీసైకింగ్‌కు పంపించాలని సూచించారు. జిల్లాలో లభ్యమయ్యే ప్లాస్టిక్ వ్యర్థాలను బట్టి ఒకటి లేదా రెండు ప్యాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం.

సౌకర్యాలు లేనిచోట కష్టమే..

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించినా సౌకర్యాలు కల్పించలేదు. ఎరువుల తయారీకి తప్పనిసరిగా నీటి సౌకర్యం అందుబాటులో ఉండాలి. తడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించేందుకు దారి సౌకర్యం ఉండాలి. నేటికీ చాలా వాటికి దారి లేదు. గ్రామాల్లో పోగయ్యే చెత్తను ఖాళీ ప్రదేశాల్లో పారపోసి నిప్పంటిస్తున్నారు. సౌకర్యాలు లేని షెడ్లలో కంపోస్టు ఎరువుల తయారీ కష్టమేనని పంచాయతీ సిబ్బంది పేర్కొంటున్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉండాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. జూన్ 4న చేపట్టే ఓట్ల లెక్కింపుపై మంగళవారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అవకతవకలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ రోజు పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేశ్ కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 4న ఆదిలాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించే ఆసిఫాబాద్, సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్‌ను నియమించామని వివరించారు. సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ఇప్పటికే పూర్తయిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మీడియా కేంద్రం ఏర్పాటు చేసి రౌండ్ల వారీగా వివరాలు వెల్లడించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వీసీలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమాకు కసరత్తు

- ఈ వానాకాలం సీజన్ నుంచే బీమా అమలు
- ప్రీమియం పూర్తిగా చెల్లించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 1.37 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- పథకం అమలుపై జిల్లా అధికారులకు శిక్షణ పూర్తి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రకృతి వైపరీత్యాలతో ఏటా పంటలు నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పంట బీమా అమలుకు కసరత్తు చేస్తోంది. త్వరలో ప్రారంభమయ్యే వానాకాలం సీజన్ నుంచే పథకాన్ని వర్తింపజేయాలని యోచిస్తోంది. ఇందుకోసం జిల్లాస్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు సైతం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ భూములు, సాగు చేసే పంటలు, లబ్ధి పొందే రైతులు తదితర వివరాలు సేకరించి నివేదికలు రూపొందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులకు ఇప్పటికే పథకం అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు అండగా నిలుస్తోంది. ఈ పథకం రాష్ట్రంలోనూ అమలు చేయాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ప్రీమియం చెల్లింపు, బీమా పరిహారం, తదితర విషయాలను ఇప్పటికే అమలవుతున్న రాష్ట్రాల్లో అధ్యయనం చేయించింది. రాష్ట్ర రైతుల ప్రయోజనం మేరకు ప్రీమియం కూడా ప్రభుత్వం చెల్లించాలని యోచిస్తోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లావ్యాప్తంగా 15 మండలాల పరిధిలో 1,37,808 మంది రైతులు ఉన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ వానాకాలం సీజన్‌కు సంబంధించిన సాగు అంచనాలు రూపొందించింది. గత వానాకాలం సీజన్‌లో జిల్లాలో 4,55,033 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా 3,42,000 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 4,52,348 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. 3,40,000 ఎకరాల్లో పత్తి, 59,212 ఎకరాల్లో వరి, 38,239 ఎకరాల్లో కంది, 6089 ఎకరాల్లో సోయాబీన్, 1700 ఎకరాల్లో పెసర, 680 ఎకరాల్లో జొన్న, 742 ఎకరాల్లో మొక్కజొన్న తదితర పంటలు సాగు చేయనున్నారు. జిల్లాలో ఏటా పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగ వరదలతో రైతులు నష్టపోతున్నారు. ఏడేళ్లుగా బీమా పథకం అమలు కాకపోవడంతో వీరికి ఎలాంటి పరిహారం అందడం లేదు. పంటలు నష్టపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తే జిల్లాలో దాదాపు 1.37 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.



కలెక్టరేట్‌లో పంటల బీమాపై శిక్షణ ఇస్తున్న ఉన్నతాధికారులు(ఫైల్)

పకడ్బందీగా అమలు

గతంలో పంటల బీమా అమలు చేసినా ప్రీమియం చెల్లించాల్సి రావడంతో చాలా మంది అన్నదాతలు ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ సర్కారు ఏడేళ్ల తర్వాత పథకాన్ని అమలు చేయాలని యోచిస్తుండగా.. క్షేత్రస్థాయిలో అవాంతరాలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పరిహారం బాధితులకు సకాలంలో అందేవిధంగా పథకం పకడ్బందీగా అమలు చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించిన విషయం తెలిసిందే. క్లస్టర్ల వారీగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్ వివరాలను పరిగణలోకి తీసుకోనున్నారు. అయితే కొన్ని చోట్ల విస్తరణ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా గ్రామాలకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పంటల బీమాను పకడ్బందీగా అమలు చేసేందుకు రైతుల బయోమెట్రిక్ తీసుకోవడంతోపాటు వారి నుంచి డిక్లరేషన్ కూడా తీసుకోవాలని భావిస్తున్నారు. జిల్లాల వారీగా పంటల సాగు అంచనాలు, ప్రీమియం చెల్లింపులకు అవసరమయ్యే నిధులు, రైతులు తదితర ప్రాథమిక వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో పథకం అమలుపై ఇప్పటికే అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

'ఉద్యోగులకు అందుబాటులో జిమ్, స్విమ్మింగ్‌పూల్'

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్, స్విమ్మింగ్‌పూల్‌ను ఇకపై పూర్తిస్థాయిలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ అన్నారు. గోలేటిలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఉన్న జిమ్ పరికరాలతోపాటు స్విమ్మింగ్‌పూల్‌ను ఏఐటీయూసీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. యూనియన్ నాయకులు పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఈఆర్ క్లబ్‌లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఎస్ఎఫ్ జవాన్లు ఉండటంతో ఇన్ని రోజులు స్విమ్మింగ్‌పూల్‌ను పూర్తిస్థాయిలో తెరవలేకపోయారన్నారు. ఇప్పటి నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అలాగే జిమ్‌లో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మరికొన్ని పరికరాలు సమకూర్చాలని అన్నారు. స్పందించిన జీఎం మాట్లాడుతూ.. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఫిట్‌నెస్ కోసం జిమ్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిమ్‌లో నూతన పరికరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం నరేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్‌బాబు, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరి రావు, క్రీడాకారులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.



జిమ్ పరికరాలు పరిశీలిస్తున్న జీఎం

ప్రజా సమస్యలపై పోరాటం

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కౌటాల(సిర్పూర్): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామని బీఆర్ఎస్ నేత, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నుంచే పోటీ చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల సమస్యలపై పోరాటం చేసేందుకు సిర్పూర్‌లోనే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క శంకర్, శ్యాంరావు, సురేశ్, ఆనంద్, సందీప్, వెంకటేశ్, గోవింద్‌రావు, మాంగేశ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

లక్సెట్టిపేట: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని దౌడపల్లి గ్రామానికి చెందిన పొన్నం అంజన్న(29) కొంతకాలంగా కడుపునొప్పి, సైనస్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంటి ఆవరణలోని దూలానికి ఉరేసుకున్నాడు. ఉపాధి హామీ పనులకు వెళ్లిన తల్లిదండ్రులు వచ్చేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుని తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి


రాజం (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని గాంధినగర్‌కు చెందిన శతాధిక వృద్ధుడు గుండా రాజం (107) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. వయోభారం పడినప్పటికీ దైనందిన కార్యక్రమాలను ఇన్నాళ్లూ చురుగ్గా నిర్వహించాడు. మూడు రోజులుగా విరేచనాలతో బాధపడుతుండగా ఇంటివద్దనే తుదిశ్వాస విడిచినట్లు మృతుని కుమారుడు సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గుండా చంద్రమాణిక్యం తెలిపారు.

వంకులంలో చోరీ

రెబ్బెన: మండలంలోని వంకులం గ్రామానికి చెందిన బోర్కుటే తిరుపతి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదుతో పాటు బంగారం అపహరించుకుని వెళ్లినట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులంతా వారం రోజుల క్రితం తిరుపతికి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ఇంటి ముందు తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం పగలగొట్టి ఉంది. అందులో భద్రపర్చిన రెండు తులాల బంగారంతో పాటు, రూ. 20 వేల నగదు కనిపించకపోవటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడికి పాల్పడిన భర్తపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మహెమూద్-అఫ్సాన దంపతుల మధ్య గతేడాది నుంచి గొడవలు జరుగుతున్నాయి. దీంతో గతేడాది మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పుట్టింట్లోనే ఉంటోంది. సోమవారం మహెమూద్ అత్తారింటికి వెళ్లి కాపురానికి రావాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించడంతో కోపోద్రిక్తుడై బండరాయితో కడుపులో కొట్టాడు. అడ్డు వచ్చిన అఫ్సాన తల్లి హుస్నూర్‌తో పాటు మరో మహిళపై సైతం దాడి చేశాడు. బాధితులు మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ఇంటర్మీడియెట్ చదువులు మిథ్య

ఇంటర్ విద్యను అభ్యసించడానికి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవకాశాలు కానరావడం లేదు. దశాబ్దాల నుంచి ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడమో.. పరిస్థితి అనుకూలించక 'పది'తోనే ఆపేయాల్సి వస్తోంది. దీంతో వారికి ఇంటర్ విద్య మిథ్యగా మారుతోంది.

- మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు ఉత్తమాటే
- ఎన్నికల హామీని నిలబెట్టుకోని ప్రజాప్రతినిధులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు జరుగుతున్నాయి. టెన్త్ ఫలితాలు వెలువడటంతోనే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో చేరికల ప్రక్రియ ప్రారంభం కాగా ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు తెరలేచింది. జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలల్లో చేరికకు సన్నద్ధమవుతుండగా గ్రామీణప్రాంత విద్యార్థులు దిక్కుతోచని పరిస్థితులను చవిచూస్తున్నారు. బెల్లంపల్లిలో రెండు, కాసిపేట మండలంలో ఒకటి చొప్పున ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల, తాండూర్ మండలాల్లో కళాశాలలు లేకుండా ఉన్నాయి. ఇంటర్ కళాశాల లేక ఎక్కడి వెళ్లి చదువుకోవాలో, ఆర్థిక వనరులు ఎంతగా అవసరమవుతాయో తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

ఏటా ఉత్తీర్ణత

టెన్త్ ఫలితాల్లో విద్యార్థులు ముందంజలో ఉంటున్నారు. అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఏటా సగటున వెయ్యిమంది వరకు టెన్త్ పరీక్షలకు హాజరవుతుండగా వీరిలో గరిష్ఠంగా 80 నుంచి 90 శాతం మంది పాసవుతున్నారు. వీరిలో బెల్లంపల్లి, కాసిపేట మండలాల విద్యార్థులను మినహా ఇస్తే మిగతా ఐదు మండలాల విద్యార్థులు ఇంటర్ చదువుల కోసం యాతనకు గురికావల్సి వస్తోంది.

హామీలు నీటి మూటలేనా?

ప్రతీ మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు ఎన్నికల హామీగానే మిగులుతోంది. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దశాబ్దకాలం పాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల సౌలభ్యం కోసం జూనియర్ కళాశాల మంజూరు చేయిస్తానని హామీ గుప్పించి ఎమ్మెల్యేగా గెలిచి పదేళ్లు కొనసాగిన ఆ వాగ్దానాన్ని నెరవేర్చలేకపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ కూడా హామీ ఇచ్చి ఇంతవరకు ఆ ఊసెత్తడం లేదు.

ఇంటర్ చదువుకోవడానికి..

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటర్ చదువుకోవడానికి బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ ప్రాంతాలకు ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లి వేళ్తుంటారు. ఆర్థికంగా ఉన్న కొద్దిమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌లో చేర్పిస్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులు అప్పు చేసి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఆర్థికలేమి కారణంగా పలువురు విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక దిక్కుతోచని పరిస్థితులను చవిచూస్తున్నారు.

ఆర్థిక స్తోమత లేదు



మాది నిరుపేద కుటుంబం. గతేడాది పదో తరగతి పాసైన. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఏకంగా పదోతరగతితోనే చదువు ఆపేసిన. చదవాలనే కోరిక ఉన్నా స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు.

– తెల్ల వెంకటేశ్, వేమనపల్లి

అనువైన పరిస్థితులు లేవు



నాది నెన్నెల. పదో తరగతి ఈఏడాదే పాసైన. ఇలాంటి పరిస్థితుల్లో మా మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంటే ఇంటర్ విద్య పూర్తి చేసే అవకాశాలు స్థానికంగానే ఉండేటివి. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి పల్లె ప్రాంతాల ఆడపిల్లలకు అనువైన పరిస్థితులు ఉండటం లేదు.

– చెన్నోజు విష్ణుప్రియ, నెన్నెల

ఇతర ప్రాంతానికి వెళ్లి చదువుకుంటా



కన్నెపల్లి మండలంలో జూనియర్ కళాశాల లేక ఇతర ప్రాంతానికి వెళ్లి చదువు కోవాల్సి వస్తోంది. కరీంనగర్ లేదా హైదరాబాద్ కు పంపించాలనే ఉద్దేశంతో మా తల్లిదండ్రులు ఉన్నారు. మండలంలో జూనియర్ కళాశాల ఉంటే బహుషా దూరం పంపించే వారు కాదేమో. అందుబాటులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.

– పూదరి అక్షిత్, రెబ్బెన

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి


ప్రగతి మైదానాన్ని పరిశీలిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులతో వేడుకలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వేడుకలు నిర్వహించే ప్రగతి మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఓపెన్‌కాస్ట్ అధికారి శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్ గోపాల్‌సింగ్, డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు, ఆనంద్‌కుమార్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో...


మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: జూన్ 2న ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్ల కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అధికారులు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో కూడా ముందుండాలి

- జీఎం సంజీవరెడ్డి


రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న జీఎం

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులు బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా సామాజిక సేవలో కూడా ముందుండాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్కే 8 డిస్పెన్సరీలో ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3, 3ఏ గనులకు చెందిన పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదన్నారు. ఎంతోమంది సమయానికి రక్తం అందక అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆపద సమయంలో రక్తదానం చేయడం వలన అలాంటి వారి ప్రాణాలను నిలబెట్టే అవకాశం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, పిట్ సెక్రెటరీ విజయ, సిబ్బంది కామర వేణు, తోట మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న అంకం నరేశ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఉమర్‌మియా సొసైటీ లేఔట్‌లో పార్కు కోసం మున్సిపల్‌కు ఇచ్చిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతూ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్ మంగళవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది అక్రమార్కులు పార్కు స్థలాన్ని కబ్జా చేసే ప్రమాదం ఉందని, ఇందుకోసం కౌన్సిల్‌లో నిధులు వెచ్చించి ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుంకరి రమేశ్, తాజుద్దీన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూళ్లలోనూ లైసెన్స్

- జూన్ ఒకటి నుంచి కొత్త చట్టం అమలు
- కనీసం మూడెకరాల స్థలం అవసరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రహదారి భద్రత చట్టం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో నూతన సంస్కరణకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లను అందుబాటులోకి తీసుకు రానుంది. ఇకపై రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లనవసరం లేకుండా ఈ స్కూళ్లలో డ్రైవింగ్ శిక్షణ పొందిన వారికి నేరుగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మోటారు వాహన చట్టం మార్పులో భాగంగా ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియ అంతా కూడా ప్రైవేటు భాగస్వామ్యంలో సాగనుంది. ఈ చట్టం జూన్ ఒకటి నుంచి అమలులోకి రానుంది. కాగా, జిల్లాలో ఇప్పటివరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూల్ లేదు సరికదా ఇప్పటికిప్పుడు డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కూడా కష్టమే. రవాణా శాఖ చట్టం నిబంధన మేరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలంటే పలు నిబంధనలు కఠినంగా ఉన్నాయి. ఇప్పుడున్న వారు ఏర్పాటుకు సముఖంగా లేరు. డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు సంస్థలు, వ్యక్తులు ముందుకు వస్తే అనుమతి ఇస్తామని రవాణా శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పారదర్శకతతో డ్రైవింగ్ ఉంటేనే..

అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే డ్రైవింగ్ శిక్షణ నాణ్యమైనదిగా, సమర్థవంతమైనదిగా, పారదర్శకతతో ఉంటే లైసెన్స్‌లు ఇవ్వాలనేది రవాణా శాఖ ముఖ్యోద్దేశం. డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే 5-ఏ సర్టిఫికెట్ల ఆధారంగా నేరుగా లైసెన్స్ జారీ చేస్తారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో రవాణాశాఖ అధికారులను పరిమితం చేస్తూ తీసుకొస్తున్న అక్రిడేటెడ్ స్కూళ్ల ఏర్పాటు ప్రస్తుతం కష్టతరంగానే ఉండనుంది. ప్రస్తుతం ఉన్న సాధారణ డ్రైవింగ్ స్కూళ్లు కూడా కఠిన నిబంధనలతో స్కూళ్ల ఏర్పాటు కష్టమే అంటున్నారు.

మూడెకరాలు కావాల్సిందే..

డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు కనీసం మూడెకరాల స్థలం కావాలి. రెండెకరాల్లో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, ప్రాథమిక శిక్షణ కోసం సిమ్యులేటర్లు ఏర్పాటు చేయాలి. మరో ఎకరంలో శిక్షణ తరగతుల కోసం భవనం, తరగతి గదులు, ఇంటర్‌నెట్ సదుపాయం, ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ, టీచింగ్ పరికరాలు మౌలిక సదుపాయాలు కల్పించాలి. భూముల విలువ రూ.కోట్లలో ఉండగా మూడెకరాల్లో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కష్టమే అంటున్నారు. అయినా ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తే ఆదాయం ఆ స్థాయిలో ఉంటుందా అనేది అనుమానమే.

నకిలీ విత్తనాలు స్వాధీనం


విత్తనాలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామంలో మంగళవారం 10 కిలోల నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా డగే తిరుపతి ఇంటి ముందు పత్తి విత్తనాలు దొరికాయి. విచారణలో ఈవిత్తనాలు కుంటల మానెపల్లి గ్రామానికి చెందిన శివుడు సరఫరా చేసినట్లు తేలింది. వ్యవసాయ అధికారి రామకృష్ణ ఫిర్యాదు మేరకు డగె తిరుపతి, శివుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అరచేతిలో వాతావరణం



- ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం
- అన్నదాతలకు ప్రయోజనకరమంటున్న అధికారులు

ఈ మధ్యకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకరోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా మరొక రోజు ఈదురు గాలులతో కూడిన అకాలవర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు అయోమయానికి గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణంలోని మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. వీటి ద్వారా వాతావరణ పరిస్థితులను అంచనా వేయొచ్చని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా వర్షాకాలం మొదలుకానున్న నేపథ్యంలో ఉష్ణోగ్రతల వివరాలు, వర్షాల రాక సమాచారాన్ని కూడా వీటి ద్వారా తెలుసుకోవచ్చు. ఉరుములు, మెరుపుల నుంచి రక్షించుకోవడం, వర్షం పరిస్థితులను అంచనా వేయడం కూడా చేయవచ్చు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ యాప్ లు రైతులకు తోడ్పడనున్నాయి. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా వీటిని డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. వాతావరణ సమాచారం మొత్తం మన అరచేతిలో ఉన్నట్లే..ఆ యాప్‌లు ఏమిటో తెలుసుకుందాం..

– నిర్మల్‌ఖిల్లా




ఒక్కోసారి వాతావరణంలో అప్పటికప్పుడు మార్పులు సంభవించి ఉరుములు మెరుపులు వస్తాయి. పిడుగుపాటు కూడా సంభవించే అవకాశం ఉంటుంది.

'డామిని'లో ఉరుములు, మెరుపుల హెచ్చరికల సమాచారం

ఇలాంటి హెచ్చరికలను తెలిపేందుకు డామిని యాప్ ప్రయోజనకరంగా ఉంటుంది. మెరుపు ఎప్పుడు వస్తుంది? మెరిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాల్సిన తీరును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. లొకేషన్ ఆధారంగా మెరుపులు వచ్చే అవకాశం ఉందో? లేదో? కూడా తెలుస్తుంది. పిడుగు పడినప్పుడు తోటి వారికి అందించాల్సిన వైద్య సహాయం వంటి ప్రాథమిక సమాచారాన్ని తెలియజేస్తుంది. రైతులకు, రైతు కూలీలకు బయటి ప్రాంతాల్లో పనిచేసే వారికి ఈ యాప్ ఎంతగానో తోడ్పడుతుంది.

వాతావరణ సమగ్ర వివరాలతో 'మేఘదూత్'



మేఘదూత్ యాప్‌లో వాతావరణానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. వర్షపాతం వివరాలు, గాలిలో తేమ, గాలి యొక్క వేగం, గాలి వీచే దిశ, నమోదైన ఉష్ణోగ్రతలు రానున్న 24 గంటల్లో వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంది. గడిచిన వారం రోజులు, రానున్న మరో నాలుగు రోజుల వాతావరణ విశేషాలు సైతం ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

వర్ష సూచనకు 'రెయిన్ అలారం'



వర్షం ఎప్పుడు పడుతుంది.. గడిచిన రోజుల వర్షపాతం వివరాలు, రానున్న కాలంలో వర్ష సూచనలను రెయిన్ అలారం యాప్ తెలియజేస్తుంది. మనం నివసిస్తున్న ప్రాంతంలో వాతావరణ, వర్ష సూచనలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయో, తదితర వివరాలు కూడా తెలియజేస్తుంది. వాతావరణంలోని ఉష్ణోగ్రత, గాలిలోని తేమ, మేఘావృతమైన ప్రాంతాల వివరాలను తగిన డేటాతో వివరిస్తుంది.

కరెంట్ ఇయ్యం...దిక్కున్న చోట చెప్పుకోండి..

- గ్రామస్తులకు విద్యుత్ సిబ్బంది బెదిరింపులు


చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గ్రామస్తులు

వేమనపల్లి: 'ఎక్కువ మాట్లాడితే మీకు కరెంట్ ఇయ్య...దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ జేఎల్ఎం బెదిరిస్తున్నాడని జాజులపేట గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో 120 విద్యుత్ కనెక్షన్లు ఉండగా 15 రోజుల క్రితం గ్రామానికి ఆధారమైన ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది గ్రామంలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ తాగునీటి అవసరాల కోసం అమర్చిన మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాత్కాలిక కనెక్షన్ ఇచ్చారు. కెపాసిటీ సరిపోక ఓవర్‌లోడ్‌తో ఫీజులు కొట్టివేయడంతో సరఫరాలో నిత్యం అంతరాయం కలుగుతోంది. గ్రామస్తులే ఫీజులు వేసుకోవడం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేసేందుకు మంగళవారం సాయంత్రం జేఎల్ఎం ఉదయ్‌కుమార్ గ్రామానికి వెళ్లగా 15 రోజుల నుంచి కరెంట్ కష్టాలతో ఇబ్బంది పడుతున్నామని, ఎవరూ పట్టించుకోవడంలేదని అనడంతో మాటా మాట పెరిగి విద్యుత్ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లి పోయారు. గ్రామస్తులు ఎస్ఈ శేషారావుకు సమాచారం ఇవ్వగా ఆయన బెల్లంపల్లి డీఈ రాజన్నకు సమాచారం ఇచ్చి రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

దాడిలో ఒకరు మృతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆసిఫాబాద్‌కు చెందిన వ్యక్తిపై పలువురు దాడి చేయడంతో మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన అలీ హుస్సేన్ (40) అదే జిల్లాకు చెందిన చంద్రి నిర్మలను పదిహేనేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన అలీ హుస్సేన్ తరచూ కొడుతుండడంతో నిర్మల పుట్టింటికి వెళ్లిపోయింది. బతుకుదెరువు కోసం నిజామాబాద్‌కు వచ్చిన హుస్సేన్ స్థానిక మహిళతో సహజీవనం చేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. అలీ హుస్సేన్ ఆదివారం తను సహజీవనం చేస్తున్న మహిళ బంధువైన మరో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో సదరు మహిళతో పాటు ఆమె భర్త, బంధువులు హుస్సేన్‌పై దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హుస్సేన్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్ స్మశాన వాటిక సమీపంలో సుద్దవాగులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం గుర్తించిన పశువుల కాపర్లు పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాన్ని వెలికితీయించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు సుమారు 25 నుంచి 35 ఏళ్లలోపు ఉంటుందని సీఐ రాజారెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.